ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :178 గురువారం ఏప్రిల్ 23 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


## ఆర్టీసీ సమ్మెతో మెట్రో దూకుడు...

- పయాణికుల కోసం పెరిగిన రైలు సర్వీసులు
- రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె.. అల్లాడుతున్న ప్రయాణికులు
- హైదరాబాద్‌లో మెట్రో కీలక నిర్ణయం.. పెరిగిన ట్రిప్పుల సంఖ్య
- అర్ధరాత్రి వరకు సర్వీసుల పొడిగింపుపై మెట్రో ఎండీ కసరత్తు



హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి):తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు నేటి నుండి సమ్మెకు దిగడంతో రవాణా వ్యవస్థ ఒక్కసారిగా స్తంభించిపోయింది. వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు పెట్టుకున్న సామాన్య ప్రజలు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలో బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పనుల నిమిత్తం బయటకు వచ్చే వారు గమ్యస్థానాలకు చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగర ప్రయాణికులకు ఊరటనిస్తూ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ సమ్మె కారణంగా పెరిగిన రద్దీని తట్టుకునేందుకు వివిధ మార్గాల్లో మెట్రో సర్వీసులను భారీగా పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది.నగరంలోని ప్రధాన కారిడార్లైన మియాపూర్-ఎల్బీనగర్, నాగోల్-రాయదుర్గం మార్గాల్లో మెట్రో తన సేవలను విస్తరించింది. సాధారణ రోజుల్లో కంటే ఎక్కువ సంఖ్యలో రైళ్లను పట్టాలెక్కించడం ద్వారా ప్రయాణికుల నిరీక్షణ సమయాన్ని తగ్గించాలని మెట్రో యాజమాన్యం నిర్ణయించింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు పనివేళలను కూడా మార్చాలని భావిస్తున్నారు. సాధారణంగా రాత్రి సమయంలో ముగిసే సర్వీసులను, సమ్మె ప్రభావం ఉన్నంత వరకు రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు మెట్రో ఎండీ వెల్లడించారు. దీనివల్ల రాత్రి వేళల్లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది.మియాపూర్-ఎల్బీనగర్ కారిడార్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఇక్కడ రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు చేశారు. సాధారణంగా రద్దీ సమయాల్లో ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు, సాధారణ సమయాల్లో 4 నిమిషాల 50 సెకన్లకు ఒక రైలు అందుబాటులో ఉంటుంది. అయితే ప్రస్తుత అత్యవసర పరిస్థితుల్లో రోజంతా ప్రతి 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు నడిచేలా ప్రణాళిక రూపొందించారు. దీనివల్ల ప్లాట్‌ఫారమ్‌లపై ప్రయాణికుల రద్దీ పేరుకుపోకుండా వేగంగా గమ్యస్థానాలకు చేరుకునే వీలు కలుగుతుంది. బస్సులు అందుబాటులో లేని లోటును తీర్చడానికి మెట్రో యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోంది.అదేవిధంగా నాగోల్-రాయదుర్గం కారిడార్‌లో కూడా సర్వీసుల సంఖ్యను గణనీయంగా పెంచారు. ఈ మార్గంలో సాధారణంగా రద్దీ లేని సమయాల్లో 5 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు నడుస్తుంటుంది. కానీ ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం రోజంతా ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు నడుపుతున్నట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. ఐటీ కారిడార్‌కు వెళ్లే ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉండటంతో ఈ నిర్ణయం వారికి పెద్ద ఊరటగా మారింది. మెట్రో స్టేషన్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించి టికెట్ కౌంటర్ల వద్ద తోపులాట జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఆర్టీసీ సమ్మె ఎంతకాలం కొనసాగినా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మెట్రో సేవలు అందిస్తామని అధికారులు భరోసా ఇస్తున్నారు. నగరంలోని అన్ని మెట్రో స్టేషన్లలోనూ రద్దీకి అనుగుణంగా భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. ప్రయాణికులు డిజిటల్ పేమెంట్లను ఆశ్రయించడం ద్వారా టికెట్ కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించాలని సూచిస్తున్నారు. అటు ప్రభుత్వం కూడా ప్రైవేటు వాహనాలను సమకూర్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, మెట్రో రైలు సర్వీసుల పెంపు అనేది నగరవాసులకు ప్రధాన ప్రత్యామ్నాయంగా మారింది. ఈ క్లిష్ట సమయంలో మెట్రో తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



## కాళేశ్వరం కేసులో.... హైకోర్టు స్టేకు కేటీఆర్ స్వాగతం



-కమిషన్ నివేదికపై చర్యలు వద్దన్న న్యాయస్థానం
-కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు
-రైతుల కోసం పని చేయాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి):కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా అప్పటి ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణలో సహజ న్యాయ సూత్రాలు పాటించలేదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ సాగిందని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పును కేటీఆర్ స్వాగతించారు. హైకోర్టు నిర్ణయం కాంగ్రెస్ రాజకీయ కుట్రలకు గట్టి చెంపపెట్టు అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రారంభం నుంచే ఈ కమిషన్ నివేదిక రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించబడిందని తాము చెప్పినది ఇప్పుడు నిజమైందని పేర్కొన్నారు.తెలంగాణకు వరప్రదాయిగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష సాధింపు చర్యలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు ఈ తీర్పు స్పష్టమైన సందేశమని కేటీఆర్ తెలిపారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే న్యాయస్థానాలు తగిన విధంగా స్పందిస్తాయని ఈ తీర్పుతో మరోసారి నిరూపితమైందన్నారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను విస్మరించారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే పేర్కొన్నారని, ఇప్పుడు హైకోర్టు కూడా అదే విషయాన్ని ధృవీకరించడం గమనార్హమని కేటీఆర్ అన్నారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలో రైతుల సమస్యలను పక్కనబెట్టి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని కేటీఆర్ సూచించారు. మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న పిల్లర్లను వెంటనే మరమ్మతులు చేసి సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్న కేటీఆర్, రైతుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే రైతులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఆర్టీసీ సమ్మెపై బీఆర్ఎస్ మద్దతు



-ప్రభుత్వ తీరును ఎండగట్టిన హరీశ్ రావు
-కార్మికుల పోరాటానికి సంఘీభావం
-బకాయిలు రూ. 3000 కోట్లు
-ఎన్నికల హామీల అమలుపై విమర్శ

హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో సంఘీభావం తెలుపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందని, దానికి సంబంధించిన జీవో గెజిట్‌లను కూడా విడుదల చేశామని గుర్తుచేశారు. కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని, ప్రస్తుత ప్రభుత్వం వారిని విస్మరించడం అన్యాయమని అభిప్రాయపడ్డారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోవడం వల్లే

2

## పేదల గడప వద్దకే సంక్షేమ ఫలాలు

-మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
-కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
-రూ. 6.50 కోట్లతో రోడ్డు పనులు
-రైతు రుణమాఫీపై కీలక వ్యాఖ్యలు



ఖమ్మం, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 27 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల గడప వద్దకే సంక్షేమ ఫలాలను నేరుగా చేరవేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని ఆయన వివరించారు. లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించిన మంత్రి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పర్యటించారు. చింతపల్లి నుంచి ముత్తగూడెం వరకు రూ. 6.50 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులను గట్టిగా ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలోనే ఈ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

2

## శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడి



-9 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
-రూ. 90 కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్
-కోర్టు స్టే ఉత్తర్వులను ధిక్కరించి అక్రమ లేఅవుట్ నిర్మాణం
-ఫిర్యాదుతో రంగంలోకి దిగి ఆక్రమణలు తొలగించిన అధికారులు

2

# ఆర్టీసీ సమ్మెపై బీఆర్ఎస్ మద్దతు

మెదటి పేజీ తరువాయి



కార్మికులు రోడ్లపైకి వచ్చి సమ్మె చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించకుండా కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయబద్ధమైన కోరికలను నెరవేర్చడంలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల సామాన్య ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మహాలక్ష్మి పథకం అమలు తీరుపై హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, దానికి సంబంధించి ఆర్టీసీకి చెల్లించాల్సిన రూ. 3000 కోట్ల బకాయిలను నిలిపివేసిందని ఆరోపించారు. ఈ భారీ బకాయిల కారణంగా ఆర్టీసీ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, ఫలితంగా ఉద్యోగులకు అందాల్సిన డీఏలు, పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సంస్థ ఆర్థికంగా చితికిపోతోందని, తక్షణమే ఆ బకాయిలను విడుదల చేసి సంస్థను, కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కార్మికులతో వెంటనే చర్చలు జరపాలని హరీశ్ రావు సూచించారు. బెదిరింపులకు పాల్పడకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యను పరిష్కరించాలని హితవు పలికారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ప్రక్రియను వేగవంతం చేసి, కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. బకాయిల చెల్లింపులో జరుగుతున్న కాలయాపనను బీఆర్ఎస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు.ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని హరీశ్ రావు కోరారు. సమ్మె వల్ల ప్రజలకు కలుగుతున్న అసౌకర్యానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన అన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న ఈ పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పందించి చర్చల ద్వారా సమ్మెకు ముగింపు పలకాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

మెదటి పేజీ తరువాయి




గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు రహదారుల అనుసంధానమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తోందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనలో భాగంగా నేలకొండపల్లి మండలం నాచేపల్లిని మంత్రి సందర్శించారు. అక్కడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని, తూకాల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే చేసి చూపించిందని గుర్తు చేశారు. సుమారు రూ. 21 వేల కోట్లు విడుదల చేసి 55 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేసిందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. రాజకీయాలకు అతీతంగా అర్హతలే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పార్టీలతో సంబంధం లేకుండా నిజమైన పేదలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ తెలంగాణను ప్రగతి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

# శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడి

మెదటి పేజీ తరువాయి




శంషాబాద్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో భారీ భూ ఆక్రమణను హైడ్రా అధికారులు బుధవారం విజయవంతంగా అడ్డుకున్నారు. సుమారు 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుండి విడిపించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ. 90 కోట్లకు పైగా ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్ 626/2లో ఉన్న మొత్తం 176.05 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వానిదేనని స్పష్టమవుతోంది. ఇందులో 166 ఎకరాలను అటవీ అభివృద్ధి సంస్థకు కేటాయించగా, మిగిలిన 9.05 ఎకరాల భూమిపై కొందరు వ్యక్తులు నిజాం కాలం నాటి హక్కులను క్లెయిమ్ చేస్తూ వివాదం సృష్టించారు.ప్రస్తుతం ఈ భూమికి సంబంధించిన వివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసు తేలే వరకు భూమి స్వభావాన్ని మార్చకూడదని, ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని న్యాయస్థానం స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ అనే వ్యక్తి ఆ భూమిని చదును చేసి అక్రమంగా లేఅవుట్‌గా మార్చినట్లు ఫిర్యాదులు అందాయి. రంగారెడ్డి కలెక్టర్, శంషాబాద్ మున్సిపల్ అధికారులకు ప్రజావాణిలో అందిన ఫిర్యాదులతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా, నిందితుడు ప్రీకాస్ట్ గోడల ద్వారా ఆక్రమణకు పాల్పడినట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. భూ ఆక్రమణ చట్టం 1905 ప్రకారం సదరు ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ మొయినుద్దీన్ ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా నిబంధనలకు విరుద్ధంగా అక్కడి భూమిని ప్లాట్లుగా మార్చి ఇతరులకు విక్రయించినట్లు విచారణలో తేలింది. దీంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఈ ఉదంతాన్ని హైడ్రా దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమణలను తొలగించాల్సిందిగా అధికారికంగా లేఖ రాయడంతో హైడ్రా రంగంలోకి దిగింది. బుధవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా బృందం ఆపరేషన్ చేపట్టి, అక్రమంగా నిర్మించిన గోడలను, లేఅవుట్ నిర్మాణాలను నేలమట్టం చేసింది.ఆక్రమణలను తొలగించిన అనంతరం 9.05 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఇక్కడ భూమి కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తూ భారీ బోర్డులను ఏర్పాటు చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో ఈ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. కోర్టు స్టే ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. నగర శివారు ప్రాంతాల్లో భూముల విలువ భారీగా పెరగడంతో ఇలాంటి ఆక్రమణలు ఎక్కువవుతున్నాయని, వీటిని అరికట్టేందుకు హైడ్రా నిరంతరం నిఘా ఉంచుతుందని అధికారులు తెలిపారు. బాధితులు ఎవరైనా అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని, కొనుగోలుకు ముందు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. శంషాబాద్ ప్రాంతంలో జరిగిన ఈ మెరుపు దాడి భూ ఆక్రమణదారుల్లో వణుకు పుట్టిస్తోంది. విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే తమ ప్రాధాన్యతని హైడ్రా స్పష్టం చేసింది. స్వాధీనం చేసుకున్న భూమిని భవిష్యత్తులో ప్రజోపయోగ కార్యక్రమాల కోసం వినియోగించే అవకాశం ఉంది.

# కాళేశ్వరం నివేదికపై స్టే...

**-మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో ఊరట**

**-ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం**

**-విచారణలో సరైన ప్రక్రియ పాటించలేదని ధర్మాసనం స్పష్టీకరణ**

**-సెక్షన్ 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వలేదన్న పిటిషనర్ల వాదనతో ఏకీభావం**



హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఈ నివేదికను ఆధారంగా చేసుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరు ఉన్నతాధికారులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదికను రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని అంగీకరిస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదని తేల్చి చెప్పింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. అయితే ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటిపై సమగ్ర విచారణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సుదీర్ఘ విచారణ అనంతరం తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టు వైఫల్యాలకు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది.పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు తన వాదనలు వినిపిస్తూ, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఈ నివేదిక ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి తమ వాదనలు వినిపించినప్పటికీ ధర్మాసనం పిటిషనర్ల వాదనపై మొగ్గు చూపింది. నిందితులుగా పేర్కొంటున్న వ్యక్తులకు తమ వెర్షన్ చెప్పుకునే అవకాశం కల్పించకుండా ఏకపక్షంగా నివేదిక ఇవ్వడం చట్టబద్ధం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీనివల్ల కమిషన్ నివేదికలోని అంశాల ఆధారంగా ప్రభుత్వం ముందుకెళ్లడం ప్రస్తుతానికి నిలిచిపోయింది.హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. ప్రభుత్వం ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా లేదా అనేది వేచి చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అల్లుకున్న అవకతవకల ఆరోపణలపై ఒకవైపు విజిలెన్స్ విచారణ, మరోవైపు ఈ జ్యుడీషియల్ కమిషన్ విచారణ కొనసాగుతున్నాయి. ప్రస్తుత తీర్పుతో బీఆర్ఎస్ అగ్రనేతలకు పెద్ద ఊరట లభించినట్లయింది. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై రాజకీయ విమర్శలు ప్రతివిమర్శలు కొనసాగుతున్న తరుణంలో, న్యాయస్థానం సరైన ప్రక్రియ పాటించాలని స్పష్టం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం తదుపరి అడుగులు ఎలా ఉంటాయనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

# మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

**-హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస**

**-రేపు పంజాగుట్టలో అంత్యక్రియలు**

**-రాజకీయ వర్గాల్లో విషాదం**



హైదరాబాద్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. అనారోగ్య సమస్యలు, వృద్ధాప్య కారణాలతో కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతూ ఉన్న ఆయన కాసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు, ఆయన అంత్యక్రియలు రేపు సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట శ్మశానవాటికలో నిర్వహించనున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో జన్మించిన నాదెండ్ల భాస్కరరావు రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైంది. 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవలో అడుగుపెట్టారు. తర్వాత ఎన్.టి.రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీలో 1982లో చేరి కీలక పాత్ర పోషించారు. 1984లో ఎన్టీఆర్ చికిత్స కోసం అమెరికాకు వెళ్లిన సమయంలో, రాజకీయ పరిణామాల నేపథ్యంలో కొంత మంది ఎమ్మెల్యేల మద్దతుతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే నెల రోజుల వ్యవధిలోనే పరిస్థితులు మారడంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. 1989లో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన, 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో మంత్రిగా సేవలు అందించారు. ఆయన మరణం పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# కేదార్‌నాథ్ ధామం ద్వారాలు తెరుచుకున్నాయి

**-భక్తుల రద్దీతో ఆలయం కళకళ**

**-51 క్వింటాళ్ల పూలతో వైభవ అలంకరణ**

**-చార్‌ధామ్ యాత్రకు శుభారంభం**


3

# కేదార్‌నాథ్ ధామం ద్వారాలు తెరుచుకున్నాయి

తరువాయి భాగం



ఉత్తరాఖండ్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): ఆధ్యాత్మిక ప్రపంచంలో అత్యంత పవిత్ర ఘట్టంగా భావించే శ్రీ కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు నేడు భక్తుల దర్శనార్థం ఘనంగా తెరుచుకున్నాయి. మంచు కొండల నడుమ కొలువైన ఈ దివ్యక్షేత్రం ఉదయం 8 గంటలకు వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ భక్తులకు స్వాగతం పలికింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుమారు 51 క్వింటాళ్ల పూలతో అద్భుతంగా అలంకరించారు. మంచుతో కప్పబడిన హిమాలయాల మధ్య ఈ ఆలయ సౌందర్యం భక్తులను ఆకట్టుకుంటోంది. స్వామి వారి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇదే సమయంలో చార్‌ధామ్ యాత్రలో మరో ముఖ్యమైన క్షేత్రం అయిన బద్రీనాథ్ ఆలయం ద్వారాలు రేపు తెరుచుకోనున్నాయి. దీంతో ఉత్తరాఖండ్‌లో ఆధ్యాత్మిక వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని నరేంద్ర మోదీ భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. చార్‌ధామ్ యాత్ర దేశ విశ్వాసానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి భక్తుడి యాత్ర సుఖసంతోషాలతో నిండాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. యాత్రలో పాల్గొనే వారు భద్రతా నిబంధనలు పాటిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని ఆస్వాదించాలని అధికారులు సూచిస్తున్నారు. మొత్తానికి, కేదార్‌నాథ్ ద్వారాల ప్రారంభంతో భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనం అయిన చార్‌ధామ్ యాత్రకు ఘన శ్రీకారం చుట్టినట్లైంది.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మనప్రజాప్రతినిధి //మద్దూరం: జనగామ నియోజకవర్గం. భారతీయ జనతా పార్టీ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి బొంగోని సురేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ఈరోజు నుండి సమ్మెకు దిగడం దురదృష్టకరం. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. కార్మికులు పలుమార్లు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. భారతీయ జనతా పార్టీ తరఫున, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు మేము పూర్తి మద్దతు తెలుపుతున్నాము. ముఖ్యంగా, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్. 2021 మరియు 2025 వేతన సవరణలను అమలు చేయాలని కోరడం. మహాలక్ష్మి పథకం కింద ఇవ్వాల్సిన నిధులను సమయానికి విడుదల చేయాలని డిమాండ్. ఉద్యోగ భద్రత మరియు ఖాళీల భర్తీ. మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు. ఇవి అన్నీ పూర్తిగా సమంజసమైన మరియు న్యాయమైన డిమాండ్లు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, ఆర్టీసీని నిర్లక్ష్యం చేస్తోంది. ఇది సాధారణ ప్రజలకు కూడా ఇబ్బందులు కలిగించే విషయం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, కార్మికులతో చర్చలు ప్రారంభించాలి. వారి సమస్యలను పరిష్కరించే దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. అని డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో, భారతీయ జనతా పార్టీ ఈ సమస్యపై ప్రజలతో కలిసి మరింత బలమైన ఉద్యమం చేపడుతుంది అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# కక్షసాధింపు రాజకీయాలకు చెక్

-ధర్మం గెలిచిందన్న ఎమ్మెల్యే పల్లా
-హైకోర్టు తీర్పుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టుడ
-నిజం ముందు కుట్రలు కూలిపోయాయి..
-కాళేశ్వరం ఒక సమగ్ర ఒక్క ప్రాజెక్ట్ మెడిగడ్డ కాదు.
-పదహారు సంస్థల అనుమతులతో నిర్మాణం జరిగింది
-ఆర్థిక సంస్థల పరిశీలన తర్వాతే రుణాలు మంజూరు
-కేసీఆర్,హరీష్ రావుపై ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమే
-రైతుల ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి
-కుంగిన స్తంభాలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్
-జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తు న్నట్లు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి నుంచి తాము చెబుతున్నట్లుగానే,ఈ తీర్పుతో కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా చివరకు ధర్మమే గెలుస్తుందని ఈ తీర్పు నిరూపించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అనేది కేవలం ఒక మెడిగడ్డ లేదా ఒకే నిర్మాణం కాదని,అనేక బ్యారేజీలు,వేల కిలోమీటర్ల పొడవైన కాలువలు,టన్నెల్స్, రిజర్వాయర్లు కలిపిన సమగ్ర ప్రాజెక్ట్ అని ఆయన వివరించారు. ఆలేరు నుంచి భువనగిరి,కొండపోచమ్మ, మల్లన్నసాగర్, అన్నపూర్ణసాగర్, రంగనాయక్ సాగర్,అప్పర్ మానేరు,లోయర్ మానేరు వంటి అనేక భాగాలను కలిపే మహత్తర యజ్ఞమే కాళేశ్వరం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కోణంలో కమిషన్ ఏర్పాటు చేసి వాస్తవా లను వక్రీకరించే ప్రయత్నం చేసిందన్నారు. కాళేశ్వరం నిర్మాణానికి కేంద్ర జలవనరుల సంఘంతో సహా దాదాపు పదహారు సంస్థలు అనుమతులు ఇచ్చాయని చెప్పారు. రాష్ట్ర కేబినెట్ ఆమోదం పొందిన తర్వాత ఇది ప్రభుత్వ సమిష్టి నిర్ణయంగా అమలైందన్నారు. అదేవిధంగా ఆర్ఈసీ,పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి సంస్థలతో పాటు బ్యాంకులు కూడా అన్ని పత్రాలను పరిశీలించిన తర్వాతే రుణాలు మంజూరు చేశాయని తెలిపారు. అప్పటి సీఎం కే.చంద్రశేఖర్ రావు,మంత్రి టి.హరీష్ రావుపై ఆరోప ణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని ఆయన స్పష్టం చేశారు. మెడిగడ్డ వద్ద రెండు స్తంభాలు కుంగిన ఘటనను చూపిస్తూ మొత్తం ప్రాజెక్ట్‌ను దూషించడం తగదన్నారు. ఆ సమస్యను వెంటనే మరమ్మ తు చేయాల్సింది పోయి, రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం చేయడం దురుద్దేశ పూరితమని విమర్శించారు. హైకోర్టు తీర్పు ద్వారా బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి చెప్పిన విషయా లే నిజమని తేటతెల్లమైందని తెలిపారు. అసంపూర్తి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక చెంపపెట్టుగా భావించవచ్చన్నారు. ఇకనైనా కక్షసాధింపు రాజకీయాలు, దుష్ప్రచారాలు మానుకుని రైతుల ప్రయోజనాల కోసం పని చేయాలని సూచించారు. కుంగిన స్తంభాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో వినియోగం లోకి తీసుకురావాలని,రైతుల సంక్షేమాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ హైమావతి...



మనప్రజాప్రతినిధి//చేర్యాల: అకాల వర్షాలు వచ్చే ఆస్కారం ఉన్నందున వరి ధాన్యం తేమ శాతం రాగానే వెంటనే లోడ్ చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. జనగామ నియోజకవర్గం. బుధవారం రోజున చేర్యాల మండలంలోని తాడూరు,చిట్యాల మరియు కొమురవెల్లి మండలంలోని మరి ముస్యాల,గౌరయపల్లి గ్రామాలలో గల వరి ధాన్య కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం దాదాపు 419 వరి ధాన్య కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలైందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు మిల్లులో కేటాయించలేదని పలువురు రైతులు తెలుపగా వెంటనే వారం కిందనే మిల్లులో కేటాయించడం ప్రక్రియ పూర్తి అయిందని వెంటనే తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయా మండల ఏపిఎం లను ఫోన్ ద్వారా ఆదేశించారు. రైతులు వరి కోత చేయగానే కొనుగోలు కేంద్రానికి కాకుండా వ్యవసాయ క్షేత్రాల వద్దనే తేమ శాతం వచ్చే వరకు అరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కేంద్రాల్లో గన్ని బ్యాగ్ లు,తేమ శాతం కొలిచే యంత్రాలు, కంతాల,పాడి క్లీనర్లు, వేసవి కాలం దృష్టా కుండలో తాగునీటి వసతి,అకాల వర్షాలు వల్ల ధాన్యం,తడవకుండా టార్ఫలిన్ షీట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తేమశాతం చెక్ చేసి తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాలు పడే ఆస్కారం ఉందని రాత్రి వేళల్లో ధాన్యం పైన టర్పాలిన్ కవర్లు తప్పనిసరిగా కప్పి ఉంచాలని రైతులకు సూచించారు.

# ఆకునూరు గ్రామంలో మన పోలీస్ మన ఊరు కార్యక్రమం




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం. సిద్దిపేట జిల్లా ప్రజలకు పోలీసులకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, స్నేహపూర్వక వాతావరణంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన "మన పోలీస్ – మన ఊరు" కార్యక్రమంలో భాగంగా నేడు చేర్యాల మండలం అకునూరు గ్రామాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్,ఐపీఎస్ సందర్శించారు. గ్రామానికి విచ్చేసిన సీపీ కి గ్రామ మహిళలు కోలాటాలతో,కళాకారులు డోలు ,వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా సీపీ,పలు అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పదహారు సిసిటివి కెమెరాలను, పాఠశాలలో నాలుగు సిసిటివి కెమెరాలను సీపీ,ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సి.పి.,స్థానిక శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నిబంధనలు మరియు మాదకద్రవ్యాల వ్యతిరేకత థీమ్‌తో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను ఆమె పరిశీలించారు. ఆ తర్వాత స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలను మరియు గ్రామస్థులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. పోలీస్ బృందం మరియు గ్రామ యువత మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. ఒగ్గు కళాకారుల ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై కథా రూపంలో అవగాహన కల్పించగా,పోలీస్ కళాబృందం డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై పాటల ద్వారా వివరించారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ,ఏప్రిల్ 1న ప్రారంభమైన 'మన పోలీస్ – మన ఊరు'కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని,గత వారం పుల్లూరు గ్రామాన్ని,నేడు అకునూరును సందర్శించడం సంతోషంగా ఉంది. పోలీసులు అంటే బయట వ్యక్తులు కాదు, మన పోలీస్ అనే భావన ప్రజల్లో కలగాలి. గ్రామంలో ఏ చిన్న సమస్య తలెత్తినా నిస్సంకోచంగా పోలీసులను సంప్రదించాలి. పిల్లలు తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోకపోవడం, డ్రగ్స్,మద్యం అలవాట్లు వంటి సమస్యలపై మాకు వినతులు వస్తున్నాయి. వీటన్నింటికీ గ్రామస్తులతో కలిసి పరిష్కారం కనుగొంటాం. మూస పద్ధతిలో కాకుండా ఒగ్గు కథలు,పాటలు మరియు వీడియోల ద్వారా ట్రాఫిక్ నియమాలు, మద్యం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించడం వల్ల ప్రజల్లో మార్పు వస్తుందని నమ్ముతున్నాం. పోలీసులు కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాకుండా,ప్రజల్లో అవగాహన కల్పించాలని చూస్తున్నామని,గ్రామ పెద్దలు యువత దారి తప్పకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపరాదని సీపి,విజ్ఞప్తి చేశారు. తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్. కుశాల్కర్,అదనపు డీసీపీ.ఎ.ఆర్.సుభాష్ చంద్రబోస్,స్థానిక ఏసిపి సదానందం,స్థానిక సి.ఐ. రమేష్,చేర్యాల ఎస్.ఐ. అపూర్వరెడ్డి,పోలీస్ సిబ్బంది,సర్పంచ్ కొమ్మురవి, ఉపసర్పంచ్,వార్డ్ మెంబర్లు, అధికారులు,గ్రామస్థులు పాల్గొన్నారు.




# పొట్టి బాల్ లక్ష్మి, మల్లేశం గౌడ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



(మనప్రజాప్రతినిధి//ఏప్రిల్ 22): సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన పొట్టి బాల్ లక్ష్మి మల్లేశం గౌడ్‌కు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.34,500 చెక్కును గ్రామ సర్పంచ్ దేవిగారి అంజయ్య, నర రాజేందర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ అవసరమైన సమయంలో ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాల్ల స్వామి, కొమ్ము రాజు, పంజా ప్రశాంత్ మరియు గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హిందూ సంఘటితము ద్వారా అఖండ భారతదేశం సుసాధ్యం

-హిందూ సంఘటితం దేశానికి శ్రీరామరక్షలి
-హిందూ ధర్మ రక్షణకు నడుం బిగిద్దాం
-హిందువులందరూ ఏకం కావాలి
-గడప లోపల కులం గడప దాటితే హిందువులం
-ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హిందూ సమ్మేళన కార్యక్రమం
-ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సరస్వతి విద్యాపీఠం సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాసరావు




మనప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 22 ఏప్రిల్ :ఇల్లంతకుంట ఉపమండల కేంద్రంలో ఇల్లంతకుంట ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు తుముకుంట మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి పరంధామ ఆశ్రమం శ్రీ శ్రీ శ్రీ పరబ్రహ్మ నందగిరి స్వామీజీ,మహిళా వక్త తెలంగాణ ప్రాంత మాతృ శక్తి సంయోజకి సిద్ధి శ్రీవాణి, ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్)ప్రధానవక్త తెలంగాణ ప్రాంత సరస్వతీ విద్యాపీఠం సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ పరబ్రహ్మ నందగిరి స్వామి జీ మాట్లాడుతూ హిందుత్వము మానవాళి హితం కోరే ధర్మమని, హిందువు మతతత్వవాది కాదని ఆయన చెప్పారు. మతం వేరు, ధర్మం వేరు అని పేర్కొన్నారు. హిందువుగా హిందూ ధర్మాన్ని, సంస్కృతిని తెలుసుకుని ఆచరించాలని వివరించారు. మహిళా వక్త సిద్ధి శ్రీవాణి మాట్లాడుతూ కుటుంబం నుండి పరివర్తన కొరకు మహిళలు పాటుపడాలని కోరారు. దేవాలయాలను శక్తివంతము చేయాలని అన్నారు.హిందువులు కులాల వారీగా విభజించబడడం హేయమని,హిందువులు సమైక్యంగా కలిసి జీవించాలని అన్నారు.ప్రధాన వక్తగా ఆర్ఎస్ ఎస్ తెలంగాణ ప్రాంత సరస్వతి విద్యాపీఠం సంఘటన మంత్రి పథకమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో హిందూ సంఘటన కొరకు ఆర్ఎస్ఎస్. స్థాపన జరిగిందని చెప్పారు. హిందువులు స్వాభిమానం, దేశభక్తి,సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు.దేశభక్తి సంస్థ ఆర్ఎస్ఎస్ అని,దేశభక్తులను తయారుచేయటమే ఆర్ఎస్ఎస్ వందేళ్ళుగా చేస్తుందని వివరించారు.హిందూ చైతన్యంతో దేశంలో అన్ని రంగాలు పరిపుష్టం అయ్యాయని పేర్కొన్నారు.పంచపరివర్తనతో కుటుంబంలో మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కుటుంబ జీవన విలువలు, సామాజిక సమరసత,స్వదేశీ పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు అందరము పాటించాలని పేర్కొన్నారు.సమ్మేళనంలో విద్యార్థులచే వేయబడిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నవి.సామూహిక భజనలతో సమ్మేళనం ఆద్యంతం ఆనందంగా,కోలాహలంగా జరిగింది.ఈ కార్యక్రమంలో కరినగర్ జిల్లా సహ శారీరక్ ప్రముక్ ఎలిగేటి వంశీ,కరినగర్ జిల్లా పర్యావరణ ప్రముక్ బత్తిని ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి ఈదుల రవీందర్రెడ్డి,కోశాధికారి నార్ల రామ్ కిషన్, ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ మామిడి రాజు, జంగంరెడ్డి పల్లె గ్రామ సర్పంచ్ పండుగ సునీత తిరుపతి, అనంతారం గ్రామ సర్పంచ్ వోల్లాల రజిత వెంకటేశం నిర్వహణ సమితి సభ్యులు కాసుపాక కిషన్, ఎగుర్ల శ్రీనివాస్,నాగ సముద్రాల బాలకృష్ణ,అక్కెం నాగరాజు,డాక్టర్ జగన్ మోహన్ రావు, మూగు నాగరాజు శర్మ,రామ్ సేటు,బొల్లం ధనుంజయ్,దొంతుల శంకర్, రేగుల కార్తీక్,బత్తిని స్వామి,పండుగ వెంకటి,సార శశికాంత్,అన్నాడి నవీన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఎర్త్ దినోత్సవ వేడుకలు




నేరేడుచర్ల( మనప్రజాప్రతిని దినపత్రిక ):పీఎంశ్రీ జిల్లాపరిషత్ఉన్నతపాఠశాల నేరేడుచర్లనందు "ధరిత్రి దినోత్సవం""ఎర్త్ డే"ను పాఠశాల "యంగ్ ఎర్త్ లీడర్స్" ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు జీవ వైవిధ్యశీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఆర్ శౌరి,ఎం జానకిరాములు మాట్లాడుతూ వివిధ కలుషిత ,కారణాలవల్ల భూతాపం నానాటికి పెరుగుతుందని ఇట్టివిపత్తు తీవ్రత నివారణకు ప్రతి ఒక్కరూ విరివిగామొక్కలునాటి సంరక్షించాలని, విద్యార్థులు వారి పుట్టినరోజుల సందర్భంగా మరియు తల్లిదండ్రులపేరున మొక్కలు నాటి సంరక్షించాలని,అడవుల విస్తీర్ణత పెరిగేందుకు కృషి అవసరమని,ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం ఘనణీయంగా తగ్గించాలని,సోలార్,పవన,జియోథర్మల్ వంటి సహజవనరులను సద్వినియోగ పరుచుకోవాలన్నారు పునరుత్పత్తి కలిగిన శక్తివనరుల వినియోగం,పర్యావరణ పరిరక్షణ వ్యక్తిధైనందిన జీవితంలో భాగమైతేనే భూగ్రహాన్ని కాపాడుకునే వీలవుతుందన్నారు అనంతరం ఎంగ్ ఎర్త్ లీడర్స్ విద్యార్థులనభినందించి "మదర్ ట్రీ"వద్ద పర్యావరణపరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ ఖాన్, జానకి రాములు,శౌరి వెంకటేశ్వరరావు, నరసింహారావు అన్నపూర్ణ మాధవి నాగమణి అశ్రోన్ ఎన్వి భానుమతి వెంకట్ రెడ్డి బికోజి యాదగిరి రామ్మూర్తి బాలు శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాసరావు వినోద్ వినిత లాల్ సాహెబ్ పాల్గొన్నారు

# నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కూతురి జన్మదిన వేడుకలు




నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిది దినపత్రిక):నేరడు చర్ల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి కుమార్తె మహాలక్ష్మి బర్త్ డే సందర్భంగా 60 జతల షూ పంపిణీ కార్యక్రమం ఘనంగా చేపట్టారు. బుధవారం నాడు నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి దంపతుల కుమార్తె మహాలక్ష్మి బర్డే సందర్భంగా మున్సిపాలిటీలోని సిబ్బందికి మున్సిపాలిటీ చైర్మన్ కొనతం చిన వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందికి షూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ శ్రీకాంత్, నన్నే పంగు శ్రీనివాస్ మాజీ కౌన్సిలర్ నూకల సుగుణ, సత్యనారాయణ రెడ్డి, యారవ శ్రీనివాస్, నూకల కళ్యాణి, మున్సిపాలిటీ సిబ్బంది ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ కార్మిక దినోత్సవం,మే డే ను జయప్రదం చేయండి




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం. కార్మికుల హక్కులను, ఎనమిది గంటల పని దినం కోసం పోరాడి సాధించుకున్న రోజే ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ప్రపంచ చరిత్ర ఒక గొప్ప పోరాటఘట్టమని ఈ పోరాటాన్నీ స్మరించు కుంటూ ఊరూరా అన్ని వాడలలో కార్మికులంతా ఏకమై మే ఒకటి న ఈ పోరాటంలో నేలకొరిగిన అమరవీరులను స్మరించుకుంటూ వీరికి ఘనంగా నివాళులర్పిస్తూ ఉత్సవాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం రోజున చేర్యాల వైశ్య భవన్ లో చేర్యాల ప్రాంత సిఐటియు,సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆముదాల మల్లారెడ్డి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ మేడే ఉత్సవాలు జిల్లాలోని అన్ని గ్రామాలలో అన్ని ప్రాంతాలలో అన్ని వాడలల్లో మేడే ఉత్సవాలు నేటి తరం కార్మికలలో,కర్షకులలో నాటి పోరాట స్ఫూర్తిని రగిలించే విధంగా జరుపుకోవాలని,నేడు కార్మిక లోకాన్ని అణిచిపెట్టే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని కార్మిక చట్టాలను మార్చి వేస్తు మళ్లీ పన్నెండు గంటల పని విధానాన్ని ప్రోత్సహిస్తూ చట్టం చేస్తున్నారని 1886 పూర్వం ఉన్న పరిస్థితులను నేడు క్రమక్రమంగా అమలు చేయాలని కార్మిక లోకాన్ని బానిసలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా నూట నలభై వ మేడే ఘనంగా నిర్వహించాలని కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను వెనక్కి నెట్టే విధంగా ప్రతి కార్మికుడు పార్టీలకతీతంగా మేడే ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో,బద్దిపడగ కృష్ణారెడ్డి, ఆలేటి యాదగిరి,అత్తిని శారద,దాసరి ప్రశాంత్,చుంచనకోట సర్పంచ్ గొర్రె శ్రీనివాస్, చేర్యాల సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు,చేర్యాల రూరల్ మండల కార్యదర్శులు బండ కింది అరుణ్ కుమార్, కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్,మద్దూరు మండల కార్యదర్శి ఎండి షఫీ,దూల్మిట్ట మండల కార్యదర్శి పోతిరెడ్డి రాజు,సిఐటియు జిల్లా నాయకురాలు ఇప్పకాయల శోభ,టౌన్ కమిటీ సభ్యులు పోలోజు శ్రీహరి,ఆముదాల నర్సిరెడ్డి,ముస్త్యాల ప్రభాకర్,ఎర్ర బోస్ అశోక్,బొంగోని భాస్కర్, ఆముదాల రంజిత్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు మోకు ఇంద్రం,రేపాక కుమార్,ఎండి కరీం,సూర్ణ తిరుపతి, మోకు దేవేందర్ రెడ్డి,బక్కెల్లి బాలకిషన్, బుడిగం వరలక్ష్మి,నూర్ బి,నంగి మైసయ్య, తుప్పతిరాజు,దేవన బోయిన కనకయ్య,ఉల్లంపల్లి రవి,బక్కేల్లి బాలకిషన్,మల్కనీ ఎల్లయ్య,గుంద్ర రవీందర్,పొన్నమైనా సిద్ధులు,డప్పు కిషన్ తదితరులు,పాల్గొన్నారు.

# దొమ్మాట గ్రామంలో చలివేంద్రం ప్రారంభం




(మనప్రజాప్రతినిధి//ఏప్రిల్ 22):సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ దేవిగారి అంజయ్య ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజలకు చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విలేజ్ సెక్రటరీ బిక్షపతి, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నీరు కాపాడితేనే భవిష్యత్తు భద్రం ఎర్త్ డే సందేశం




రాయపోల్, //ఏప్రిల్ 22 (మన ప్రజా ప్రతినిధి):సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో ఎర్త్ డే సందర్భంగా నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నీటి సద్వినియోగం, వృథా నివారణ, మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నీటిని అవసరానికి తగ్గట్టుగా వినియోగించు కోవాలని, వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటిలో ట్యాప్‌లు వాడిన తరువాత తప్పకుండా మూసివేయాలని, వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలో నిల్వ చేసుకోవాలని తెలిపారు.అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించకపోతే భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని, నీరు లేకపోతే జీవజాతి అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భవిష్యత్తులో కరువు పరిస్థితులను ఎదుర్కోకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవ్, నవీన్, రాములు, నర్సింలు గౌడ్, ప్రభాకర్, కమలాకర్, అమరేందర్, వసంత, అలాగే సి.ఆర్.పీ యాదగిరి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో కొత్త అధ్యాయం



(మన ప్రజా ప్రతినిధి ఏప్రిల్ 22)/తొగుట మండలం/:సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్ద మాసంపల్లి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు దేవరయ వసంత, కృష్ణయ్యలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పేద ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు గృహ సౌఖ్యాన్ని పొందుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, సీనియర్ నాయకులు కూచి మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక పాఠశాల ఘణపురం లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




మన ప్రజా ప్రతినిధి //తొగుట: తొగుట మండలం, ప్రాథమిక పాఠశాల ఘణపురం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖ. చంద్రకళ అధ్యక్షతన గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తొగుట మండల విద్యాధికారి ఎ. నర్సయ్య, ఘణపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖ. అంజలి పాల్గొని UKG, మరియు 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందజేశారు. వీజూ ఎ.నర్సయ్య పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెదులుతూ బాగా చదువుకొని మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. పాఠశాల చేసే పలు కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఖ. అంజలి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. అనంతరం ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఖ.చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా పనిచేస్తున్నాయని కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, వనజ, రవీందర్, శేఖర్, రాజ్ కుమార్, రవి, ప్రేమల, నవనీత-చాూరాజ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బచ్చన్నపేటలొ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, బచ్చన్నపేట, జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం. బచ్చన్నపేట మండలం, తమ్మడపల్లి,బచ్చన్నపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్,ఆర్డీఓ గోపి రామ్ నాయక్,తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేస్తున్న తీరును వారు స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఎండ తీవ్రత దృష్ట్యా రైతులకు సరిపడా మంచినీరు,నీడ కోసం టెంట్లు,ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులు తమ ధాన్యానికి సంబంధించి తేమ శాతాన్ని సరిచూసుకుని,వెంటనే టోకెన్లు పొంది కాంటా వేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్ రావు,ఏపీఎం రవి,సర్పంచ్ బేజాడి సిద్ధులు,ఆర్ఐఓ వంశీకృష్ణ,పిఏసిఎస్ సీఈఓ కాసా బాలస్వామి,సీసీ సందుల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# ఒకే సిపిఐ(ఎం.ఎల్) నిర్మాణానికి పూనుకోవాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :లెనిన్ జయంతి, పార్టీ పుట్టిన రోజు ను పురస్కరించుకుని జరిగిన సభలో సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి షేక్ షావలి పిలుపు. కె.కిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం.అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థ కలిగిన భారతదేశంలో బలమైన ఒకే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) నిర్మాణానికి పూనుకోవాలని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి పార్టీ శ్రేణులకు, విప్లవ ప్రజానీకానికి పిలుపునిచ్చారు. 2026, ఏప్రిల్-22, బుధవారం రోజు కాప్రా, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, బాలాజీనగర్ లోని దళిత సంక్షేమ భవనంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ 156 జయంతి పురస్కరించుకుని ఐ.ఎఫ్.టి.యు. నేత కె.కిషన్ అధ్యక్షతన సిపిఐ(ఎం.ఎల్) పార్టి 57 వ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. 1968 లో సిపిఎంతో రాజకీయంగా తెగతెంపులు చేసుకొని, మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానం కలిగిన పంథాను విప్లవకారులు చేపట్టారని గుర్తుచేశారు. రివిజనిస్టు-నయారివిజనిస్టు పార్టీలకు వ్యతిరేకంగా ఒక బలమైన విప్లవ సిద్ధాంతంపై ఆదారపడిన విప్లవ పార్టీ అవసరాన్ని గుర్తించి 1969, ఏప్రిల్-22 న సిపిఐ(ఎం.ఎల్) పార్టీని ఏర్పాటు చేసుకొన్నారని తెలియజేశారు. భారత్ లాంటి వెనుకబడ్డ దేశంలో కార్మికవర్గ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనలో ఎందరో విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణాలను దారపోశారని అన్నారు. కామ్రేడ్స్ చంద్రపుల్లారెడ్డి, చారుమజుందార్, కేడిసేథీ, ఫణిబాక్చీ, సత్యం, కైలాసం, నిర్మల, స్నేహలత, పొట్ల రామనర్సయ్య, నీలం రామచంద్రయ్య, జార్జిరెడ్డి, జంపాల, జానకిరాంరెడ్డి, సుభాష్, ఇరుగు భిక్షం, గొడ్డలి భిక్షం, శాంతక్క, నాగారాజు, వెంకటరెడ్డి, అరుణక్క, జయక్క, సామా అంతిరెడ్డి, మదుసూదన్ రాజ్, సునీల్ పాల్, వినోద్, దుబ్బాక సంజీవ్ రెడ్డి, సోమాచారి, రాదక్క, రాంచంద్రన్, ఎం.వి.ప్రసాద్, వసంతక్క, చలమన్న, క్రిష్ణన్న, గోపగాని శ్రీను, హరియా, సరియా, ముస్తాఫా, భూపతన్న, రాచకొండ నారాయణ, కాశన్న, జేమ్స్, మోజేష్, మునుకోటి వేణు, రాపర్తి ధర్మన్న, బొద్దపు రాజన్న లాంటి వేలాదిమంది భూమి, భుక్తి, పీడిత ప్రజా విముక్తే ధ్యేయంగా బడాబూర్జువా, బడా భూస్వామ్య, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వ్యవసాయిక విప్లవాన్ని చేపట్టి, తమ చివరిశ్వాస వరకు పోరాడిన అమరులకు సభ ప్రారంభంలో రెండు నిముషాలు మౌనం పాటించి, విప్లవ జోహార్లు అర్పించారు. పార్టీలో తలెత్తిన అన్యవర్గ దోరణులు, అతి,మితవాద, లొంగుబాటు రాజకీయ విధానాల వలన 1971, 1980, 1984, 1988 లో పార్టీ చీలికలకు గురైయ్యిందని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత నగ్జల్ బరీ, శ్రీకాకుళం, ముషహరి, మిడ్నాపూర్ లాంటి ప్రాంతాల్లో సాయుధ పోరాటాలు దేశవ్యాప్తంగా పెల్లుబికాయని, అదేక్రమంలో కామ్రేడ్ సిపిరెడ్డి స్వయంగా ఆచరించి, నిర్మించిన గోదావరిలోయ ప్రతిఘటన పోరాటం 18 రాష్ట్రాలకు వ్యాపించిందని, దున్నేవానికే భూమి ప్రాతిపదికన లక్షలాది ఎకరాల భూములు ప్రజలు స్వాధీనం చేసుకొన్నారని అన్నారు. భూస్వాములు, గుండాలు, పోలీసులకు వ్యతిరేకంగా సంఘటితం అయ్యి, ఉద్యమాన్ని ఇతర ప్రాంతాలకు విస్తరింపజేశారని గుర్తుచేశారు. అంతేకాక దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అందించిన పోరాటంగా చరిత్ర పుటల్లో నిలిచిందని కొనియాడారు. సిపిరెడ్డి నాయకత్వాన దేశంలో బలమైన సిపిఐ(ఎం.ఎల్) పార్టిగా రూపుదిద్దుకుందని, ఇతర విప్లవ స్రవంతులలో ఉన్నవారికి ఎన్నో గుణపాఠాలు, అనుభవాలను అందించిన పోరాటంగా గోదావరిలోయ ప్రతిఘటన పోరాటం ఆచరణలో నిలబడిందని స్పష్టం చేశారు. 2023 లో ఐక్యత మాటున అత్యున్నత పార్టి పదవులను పొంది, పార్టీ రాజకీయ, నిర్మాణ వ్యతిరేక, వ్యక్తిగత, స్వార్థపర అవకాశవాద పనివిధానంతో కొందరు విచ్ఛిన్న చర్యలకు పాల్పడిన వారే, నేడు పార్టీని వీడారని అన్నారు. సంగారెడ్డి, నల్గొండ కు చెందిన ముగ్గురు రాంచంద్రన్ పార్టీతోను, కర్నూలుకు చెందిన మరో నలుగురు న్యూడెమోక్రసీ పార్టీతో విలీనం పేరుతో వ్యక్తులుగా కలిసి పోయారని, పైగా తమ కలయిక విప్లవ సంస్థల ఐక్యతోలో బాగమేనని చెప్పడం అంతకన్న విడ్డూరం మరొకటి ఉండదని ఎండగట్టారు. ఒక సంస్థను వీడి, మరోక సంస్థలో చేర్చుకునే వారెవరైన, ఇది ఎట్లాంటి విలీన ఐక్యతో? విప్లవ ప్రజానీకానికి చెప్పాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ లో విప్లవకారులు, విప్లవ సంస్థలు లేకుండా పోయాయని, మార్క్సిజం, లెనినిజానికి కాలం చెల్లిందని, బడా కార్పొరేట్లు, మతతత్వ వాదులు సంతోష పడుతున్నారని అన్నారు. కానీ దోపిడీ, పీడన, అణిచివేత ఉన్నన్నాళ్ళు తిరుగుబాట్లు, పోరాటాలు సజీవంగా ఉంటాయనేది చరిత్ర చెప్పిన సత్యాన్ని విస్మరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని వర్గపోరాటాలవైపు మళ్ళించేలా, ఉక్కు క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు విలువలతో దేశంలోనే ఒక బలమైన విప్లవ సంస్థగా సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టిని నిలబెడుతామని ఏప్రిల్-22 పార్టీ పుట్టిన రోజున ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. ఈపై కార్యక్రమంలో పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, ధక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య మహ్మద్ రషీద్ ద్రావీడ, బహుజన సత్త బండకింది సింగరాయగౌడ్, తెలంగాణ రైతుకూలీ సంఘం పిట్టల సత్యం, తెలంగాణ వికలాంగుల సమితి మోనార్ దుర్గాప్రసాద్ మరియు సైయద్, యమునా గౌడ్ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# పేదల కళ్ళల్లో ఆనందమే... ప్రజా ప్రభుత్వం లక్ష్యం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:పేదల కళ్ళల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆరు గ్యారంటీ పథకాలతో తెలంగాణ స్వర్ణయుగలంలా మారుతుందని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ , కీసర సర్కిల్ పరిధి జవహర్ నగర్ బి జె ఆర్ నగర్ లో నూతనంగా నిర్మాణమైన ఇందిరమ్మ ఇళ్ళను హౌసింగ్ డీఈ అశోక్ కుమార్, ఏ ఈ శ్రీహరి లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ గారి సారథ్యంలో జవహర్ నగర్ లో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ళు వచ్చాయని, లబ్ధిదారులు ఇళ్ళు పూర్తయినందుకు సంతోషంగా ఉన్నారని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్ కుమార్, సీనియర్ నాయకులు బొబ్బిలి మంజుల , మాట్లా శ్రీనివాస్,రాజు యాదవ్, నాయకం భాస్కర్, అజయ్ కుమార్, యాదగిరి యాదవ్, వీర్ల బుజ్జి, ప్రభాకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

# బస్సు సేవలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 22,:ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రైవేట్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ఎలాంటి అభద్రత భావానికి గురి కావద్దని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని, డ్రైవర్లు నిరభ్యంతరంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఆర్టీసీ బస్సులను ప్రైవేట్ వ్యక్తులు నడుపుతున్న నేపథ్యంలో బస్సుల ప్రయాణానికి అడ్డంకులు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల రవాణా సౌకర్యాన్ని భంగం కలిగించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.బస్సులను మధ్యలో ఆపడం, మార్గంలో అటంకాలు సృష్టించడం, డ్రైవర్లపై దాడులకు పాల్పడటం వంటి చర్యలకు దిగితే వారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని, ఏవైనా సమస్యలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని ఎస్పీ సూచించారు.

# అకాల వర్షంతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 22.:చేగుంట మండలంలో ఇటీవల అకాల వర్షంతో నష్టపోయిన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ తో కలిసి క్షేత్రస్థాయిలో మక్కారాజ్ పేట్ గ్రామం లో జరిగిన నష్ట పోహిన పంట పొలాలను పరిశీలించారు, . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని మక్కరాజ్‌పేట, చందాయిపేట, రాంపూర్, కన్యారం, చిన్న శివ్నూర్ గ్రామాల్లో కలిపి ప్రాథమికంగా 4165 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని గుర్తించినట్లు తెలిపారు. చేతికొచ్చిన వరి పంట నేలపాలు కావడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామని, బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు సీఐటీయూ మద్దతు




మన ప్రజ ప్రతినిధి తెలుగు దినపత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 22:రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా మెదక్ డిపోలో చేపట్టిన సమ్మెకు సీఐటీయూ సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. సమస్యలను పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్షణమే ఆర్టీసీ కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా జరుగుతున్న సమ్మెపై నిర్బంధ చర్యలు ఆపాలని కోరారు. ఆర్టీసీ పరిరక్షణతో పాటు రెండు బకాయి వేతన సవరణలు సహా 32 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు.కార్మికులు చట్టబద్ధంగా సమ్మె నోటీసులు ఇచ్చి ఉద్యమం చేపడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగాన్ని రంగంలోకి దింపి సమ్మెను అణిచివేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హైర్ బస్సుల యజమానులు నిబంధనలు పాటించకుండా లైసెన్స్ లేని, మెడికల్ అన్‌ఫిట్ డ్రైవర్లతో బస్సులు నడిపిస్తున్నారని విమర్శించారు. తాత్కాలిక కండక్టర్లను నియమించి, సమ్మె ముగిసిన వెంటనే వారిని తొలగించడం నిరుద్యోగులతో ఆటలాడటమేనని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రైవేటీకరణను పూర్తిగా రద్దు చేయాలని ఈ సమ్మెలో ప్రధాన డిమాండ్ ఉన్నందున ప్రజలు సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.డిపో మేనేజర్లు, హైర్ బస్సు యాజమాన్యాలు బెదిరింపులకు పాల్పడుతున్నాయని, బస్సులు నడపవద్దని కార్మికులు శాంతియుతంగా డ్రైవర్లను మెప్పించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ సమయంలో పోలీసులు కార్మికులను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఖండనీయమని అన్నారు.సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.

# ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్...
# వార్షికోత్సవం మరియు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




మనప్రజాప్రతినిధి/రాజన్నసిరిసిల్ల, ఏప్రిల్, 22:స్థానిక ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ ఆధ్వర్యంలో 'గ్రాడ్యుయేషన్ డే' మరియు 'వార్షిక ఫలితాల వేడుక' బుధవారం పట్టణంలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జీవితంలో విద్య ఒక భాగమే డిఈఓ జగన్మోహన్ రెడ్డిఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డిఈఓ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం మార్కుల కోసమే కాకుండా విజ్ఞానం కోసం చదవాలని సూచించారు. "జీవితంలో విద్య ఒక భాగమే కానీ, విద్యే జీవితం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఒత్తిడికి లోనుకాకుండా లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. అలాగే, పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల బాధ్యత కీలకమని, వారిని నిరంతరం ప్రోత్సహించాలని గుర్తు చేశారు.మండల విద్యాశాఖ అధికారి,రఘుపతి గారువార్డు కౌన్సిలర్ బుర్ర నారాయణ గౌడ్ గారు శంకర్ రావు గారు పాల్గొన్నారు.పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపల్ రాజ్ కుమార్ గారు విద్యాసంవత్సర ప్రగతి నివేదికను చదివి వినిపించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# చేర్యాల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మల్లికార్జున కార్గే దిష్టిబొమ్మ దహనం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.భారతీయ జనతా పార్టీ చేర్యాల మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే దిష్టిబొమ్మ దహనం చేయడమైనది.నిన్నటి రోజున చెన్నైలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్లికార్జున కార్గే,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని,ఉగ్రవాదిగా మాట్లాడడం అవిశ్వాసంగా ఉన్నది.రజాకారులు మల్లికార్జున కార్గే వారి తల్లిని అదేవిధంగా వారి చెల్లెలిని దారుణంగా హత్య చేసిన మరియు వారి ఇంటిని దహనం చేసినా కూడా రజాకారులకు మద్దతు ఇస్తు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే నరేంద్ర మోడీ గురించి తప్పుగా మాట్లాడడం అతని విజ్ఞతకే వదిలి వేస్తున్నాము.మల్లికార్జున కార్గే,రాహుల్ గాంధీ,సోనియా గాంధీ,మెప్పుకోసం ఇటువంటి పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడడం విడ్డూరంగా ఉన్నది. మల్లికార్జున కార్గే పైన చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరడమైనది.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్ర మహేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు కొట్టే చంద్రమౌళి,చల్లా బాల్రెడ్డి,వడ్లకొండ వెంకటేశం,నిమ్మ లక్ష్మారెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల మనీష్ కుమార్,మండల ఉప అధ్యక్షులు బయ్యారపు యాదగిరి,మండల కార్యదర్శి గంధల సత్యనారాయణ,పోలోజు రవి చారి,ఎస్సీ మోర్చ పట్టణ అధ్యక్షులు ముస్త్యాల శ్రీనివాస్,మండల మనకి బాత్ కన్వీనర్ గుంటి రాములు,బూత్ అధ్యక్షులు కేతోజు సాయికుమార్ చారి, భాను కుమార్,బూడిద అరుణ్ కుమార్,గట్టోజు వేణు,రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

# పెహల్గాం ఉగ్రదాడి బాధితులకు ప్రధాని నివాళి

**-ఉగ్రవాదానికి భారత్ తలవంచదని మోదీ స్పష్టం**
**-పెహల్గాం ఘాతుకానికి ఏడాది పూర్తి..**
**-మృతుల కుటుంబాలకు ప్రధాని పరామర్శ**
**-ఉగ్రవాద నిర్మూలనపై ఎక్స్ వేదికగా నరేంద్ర మోదీ కీలక ప్రకటన**
**-ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదులకు తగిన గుణపాఠం**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): పెహల్గాం ఉగ్రవాద దాడి జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధితులను స్మరించుకుంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానికి భారత్ ఎన్నటికీ తలవంచబోదని ఆయన స్పష్టం చేశారు. తమ దేశ వ్యతిరేక కార్యకలాపాలతో ఉగ్రవాదులు ఎప్పటికీ విజయం సాధించలేరని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పెహల్గాంలో గత ఏడాది ఇదే రోజున లష్కరే తొయిబా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆనాటి మారణహోమంలో ప్రాణాలు కోల్పోయిన వారిని దేశం ఎప్పటికీ మరువలేదని ప్రధాని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ఈ ఘటనపై స్పందిస్తూ ఉగ్రవాద బాధిత కుటుంబాల పట్ల తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఒక దేశంగా కష్ట సమయాల్లో మనమంతా కలిసికట్టుగా ఉంటామని ఆయన పిలుపునిచ్చారు. భారత్ ఎటువంటి ఉగ్ర బెదిరింపులకు లొంగదని, ముష్కరుల కపట మోసాలు ఎంతో కాలం నిలవలేవని ఆయన హెచ్చరించారు. అమాయకుల రక్తంతో తడిసిన ఆ నేల సాక్షిగా ఉగ్రవాదాన్ని వేళ్లతో సహా పెకిలించి వేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. దేశ సమగ్రతను దెబ్బతీయాలని చూసే శక్తులకు గట్టి సమాధానం చెబుతామని ఆయన పునరుద్ఘాటించారు.పెహల్గాం ఉగ్రవాద దాడి ఘటనను కేంద్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సింధూర్' పేరుతో పాకిస్థాన్‌పై మెరుపు దాడిని చేపట్టింది. సరిహద్దు అవతల పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ప్రధాన ఉగ్రవాద స్థావరాలను ఈ ఆపరేషన్ ద్వారా భారత దళాలు ధ్వంసం చేశాయి. ఉగ్రవాదుల లాంచింగ్ ప్యాడ్‌లను లక్ష్యంగా చేసుకుని సాగించిన ఈ సైనిక చర్య ఉగ్రవాద మూలాలను దెబ్బతీసింది. శత్రువుల స్థావరాలను మట్టికరిపించడం ద్వారా భారత్ తన రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఈ చర్య ద్వారా ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు పంపింది.పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు పర్యాటక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడం పట్ల అంతర్జాతీయ స్థాయిలోనూ తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పెహల్గాం వంటి ప్రశాంత ప్రాంతాల్లో అలజడి సృష్టించి పర్యాటక రంగాన్ని దెబ్బతీయాలని ఉగ్రవాదులు కుట్ర పన్నారు. అయితే భారత భద్రతా దళాల అప్రమత్తత, ఆపరేషన్ సింధూర్ వంటి ధీటైన ప్రతిస్పందనలతో ఆ కుతంత్రాలు విఫలమయ్యాయి. సరిహద్దుల వద్ద నిఘాను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఉగ్రవాదుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతున్నారు. దేశ సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని ప్రజలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఉండటమే లక్ష్యంగా భద్రతా సంస్థలు పనిచేస్తున్నాయి. పెహల్గాం బాధితుల స్మృతిగర్థం స్థానికంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి మద్దతు లభిస్తోంది. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలను అంతర్జాతీయ వేదికలపై భారత్ ఎండగడుతోంది. అమాయకుల ప్రాణాలను బలిగొనే ఉగ్రవాద భూతాన్ని అంతం చేసే వరకు విశ్రమించబోమని, ఇది కేవలం ఒక ప్రాంతపు సమస్య కాదని, యావత్ ప్రపంచం కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని భారత్ అభిప్రాయపడుతోంది.

# కేదార్‌నాథ్ ధామం ద్వారాలు తెరుచుకున్నాయి

ఉత్తరాఖండ్, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): ఆధ్యాత్మిక ప్రపంచంలో అత్యంత పవిత్ర ఘట్టంగా భావించే శ్రీ కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు నేడు భక్తుల దర్శనార్థం ఘనంగా తెరుచుకున్నాయి. మంచు కొండల నడుమ కొలువైన ఈ దివ్యక్షేత్రం ఉదయం 8 గంటలకు వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ భక్తులకు స్వాగతం పలికింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుమారు 51 క్వింటాళ్ల పూలతో అద్భుతంగా అలంకరించారు. మంచుతో కప్పబడిన హిమాలయాల మధ్య ఈ ఆలయ సౌందర్యం భక్తులను ఆకట్టుకుంటోంది. స్వామి వారి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు.ఇదే సమయంలో చార్‌ధామ్ యాత్రలో మరో ముఖ్యమైన క్షేత్రం అయిన బద్రీనాథ్ ఆలయం ద్వారాలు రేపు తెరుచుకోనున్నాయి. దీంతో ఉత్తరాఖండ్‌లో ఆధ్యాత్మిక వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని నరేంద్ర మోదీ భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. చార్‌ధామ్ యాత్ర దేశ విశ్వాసానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రతి భక్తుడి యాత్ర సుఖసంతోషాలతో నిండాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. యాత్రలో పాల్గొనే వారు భద్రతా నిబంధనలు పాటిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని ఆస్వాదించాలని అధికారులు సూచిస్తున్నారు. మొత్తానికి, కేదార్‌నాథ్ ద్వారాల ప్రారంభంతో భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనం అయిన చార్‌ధామ్ యాత్రకు ఘన శ్రీకారం చుట్టినట్లైంది.

# దానం పల్లి గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమం



మన ప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.చేర్యాల మండలం, దానంపల్లి గ్రామంలో బుధవారం రోజున ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ రమాదేవి ఆధ్వర్యంలో ఏనమీదవ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిడిపిఓ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ,అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అన్నప్రాసన (ప్రథమ ఆహారం) మరియు గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం చేశామన్నారు. అలాగే పోషణ పక్వాడ (ఏప్రిల్ 9 నుంచి 23 వరకు) లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమం ద్వారా బాల్య పోషణ,ప్రారంభ విద్యా సేవలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు,టీచర్లు,ఆయాలు,గర్భిణీ స్త్రీలు,చిన్నారుల తల్లిదండ్రులు,పాల్గొన్నారు.

# పహల్గాం ఉగ్రదాడి వెనుక విస్తుపోయే నిజాలు

పహల్గాం, ఏప్రిల్ 22 (మనప్రజాప్రతినిధి): పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన అమానుష దాడి జరిగి నేటికి ఏడాది పూర్తయిన సందర్భంలో, ఆనాటి భయానక మారణహోమం మిగిల్చిన గాయాలు 26 కుటుంబాలను నేటికీ వేధిస్తూనే ఉన్నాయి. ఈ విషాదకర ఘటనకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ చేపట్టిన విచారణలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాటి దాడికి పాల్పడిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులకు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ అనే ఇద్దరు స్థానికులు ఆశ్రయం కల్పించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ ఉగ్రవాదుల కదలికల గురించి పోలీసులకు సమాచారం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆ ఇద్దరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా మౌనం వహించారని ఎన్ఐఏ స్పష్టం చేసింది. కేవలం మూడు వేల రూపాయల లంచం కోసం దేశ భద్రతను తాకట్టు పెట్టి, ముష్కరులకు సహకరించడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.గత ఏడాది ఏప్రిల్ 22న ఈ దాడులు జరగగా, అంతకుముందు రోజు రాత్రి నుంచే ఉగ్రవాదుల కదలికలు స్థానిక నిందితులకు తెలుసని విచారణలో వెల్లడైంది. ఏప్రిల్ 21 రాత్రి 10.30 గంటల సమయంలో ఆయుధాలతో వచ్చిన ముగ్గురు ఉగ్రవాదులు పర్వేజ్, బషీర్ వద్ద ఆశ్రయం పొందారు. వారు మాట్లాడే ఉర్దూ, పంజాబీ భాషల కలయికను బట్టి వారు సరిహద్దు అవతలి వ్యక్తులని గుర్తించినా, నిందితులు పోలీసులను అప్రమత్తం చేయలేదు. లష్కరే తయిబా కమాండర్ సాజిత్ జాట్ అలియాస్ అలీభాయ్ గురించి ఆ ఉగ్రవాదులు మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ ప్రాంతంలో భారీ దాడి జరగబోతోందని వారికి స్పష్టంగా అర్థమైంది. అయినప్పటికీ, తమ స్వార్థం కోసం ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచి, ఉగ్రవాదుల మారణకాండకు పరోక్షంగా సహకరించారు. దాదాపు ఐదు గంటల పాటు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించి, వారికి భోజన వసతులు సమకూర్చినందుకు ప్రతిఫలంగా నిందితులు రూ. 3 వేలు అందుకున్నట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది.



ఏప్రిల్ 22 మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బైసరన్ లోయలోని కంచె వెనుక ఉగ్రవాదులు నక్కి ఉండటాన్ని కూడా ఈ ఇద్దరు స్థానికులు గమనించారు. ఆ సమయంలోనైనా భద్రతా దళాలకు, పర్యాటక నిర్వాహకులకు సమాచారం అందించి ఉంటే ఇంతటి ప్రాణనష్టం జరిగేది కాదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కానీ, ఆ ఇద్దరు నిందితులు తమ గుర్రాల సవారీ కోసం పర్యాటకుల వేటలో నిమగ్నమై, ఉగ్రవాదుల ఉనికిని కప్పిపుచ్చారు. మానవత్వం కంటే కేవలం కొంత మొత్తం నగదుకే వారు ప్రాధాన్యత ఇవ్వడం దర్యాప్తు అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో పర్యాటకులు రాగానే, ఏమాత్రం సంకోచం లేకుండా వారిని ముష్కరులు మాటువేసిన బైసరన్ లోయ ప్రాంతానికే ఈ గుర్రపు స్వారీ నిర్వాహకులు తీసుకువెళ్లారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కాల్పుల శబ్దాలతో ఆ ప్రాంతమంతా రక్తసిక్తంగా మారడాన్ని కళ్లారా చూసిన నిందితులు, తమకేమీ తెలియనట్లుగా అక్కడి నుంచి నిశ్శబ్దంగా జారుకున్నారు. ఎన్ఐఏ బృందం లోతైన దర్యాప్తు చేపట్టి గత ఏడాది జూన్ 22న వీరిద్దరినీ అదుపులోకి తీసుకుంది. ఉగ్రవాదులకు సహకరించడం, నేరాన్ని దాచిపెట్టడం వంటి తీవ్రమైన అభియోగాల కింద వీరిపై కేసులు నమోదు చేశారు. లంచం తీసుకుని ఉగ్రవాదులకు సహకరించిన ఈ ఉదంతం స్థానిక రక్షణ వ్యవస్థలో లోపాలను, కొంతమంది వ్యక్తుల బాధ్యతారాహిత్యాన్ని ఎత్తిచూపుతోంది.డిసెంబర్ నెలలో ఎన్ఐఏ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో లష్కరే తయిబా అగ్ర కమాండర్ సాజిత్ జాట్‌తో పాటు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌ల పేర్లను ప్రధాన నిందితులుగా చేర్చారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు నేటికీ న్యాయం కోసం ఎదురుచూస్తున్నాయి. కేవలం మూడు వేల రూపాయల కోసం దేశంపై దాడికి సహకరించిన స్థానికుల ఉదంతం భద్రతా సంస్థలను మరింత అప్రమత్తం చేసింది. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే వారు ఉగ్రవాదుల ప్రలోభాలకు లొంగకుండా ఉండాలని, అనుమానిత కదలికలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రభుత్వం కోరుతోంది. పహల్గాం దాడి వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని దర్యాప్తు వర్గాలు స్పష్టం చేశాయి.